# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 38 | విశాఖపట్నం | 8-11-2025 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 38 | VISAKHAPATNAM | 8-11-2025 SATURDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన క్రికెటర్ శ్రీ చరణి




**అమరావతి, పతాకం న్యూస్:** ఐసీసీ మహిళల ప్రపంచకప్ గెలిచిన భారత క్రికెట్ జట్టు సభ్యురాలు, తెలుగమ్మాయి శ్రీ చరణి ముఖ్యమంత్రి చంద్రబాబును నేడు మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తనతో పాటు సహచర క్రీడాకారులు సంతకాలు చేసిన టీమిండియా జెర్సీని ఆమె ముఖ్యమంత్రికి బహూకరించింది. శ్రీ చరణి అభిమానంతో ఇచ్చిన ఆ జెర్సీని సీఎం చంద్రబాబు ఆప్యాయంగా స్వీకరించారు. శుక్రవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. శ్రీ చరణికి ఆయన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ చరణిని, మహిళా క్రికెట్ జట్టును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచకప్ గెలిచి భారత మహిళల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పారని ప్రశంసించారు. ఎందరో యువ క్రీడాకారిణులకు శ్రీ చరణి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరఫున ఓ వీణ బొమ్మను జ్ఞాపికగా బహూకరించారు. ఈ క్రమంలో, తనకు మద్దతుగా నిలిచినందుకు శ్రీ చరణి ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా పాల్గొన్నారు. అంతకుముందు, గన్నవరం విమానాశ్రయంలో శ్రీ చరణికి ఘన స్వాగతం లభించింది. మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. వారంతా ఆమెతో పాటు సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా, శ్రీ చరణి చారిత్రక (తరువాయి 2వ పేజీలో)

## వందేమాతర గేయం
# అన్ని తరాలకు స్ఫూర్తి: మోడీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వందేమాతర గీతం ఒక స్వప్నం, ఒక సంకల్పం, అదొక స్ఫూర్తి మంత్రమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. శుక్రవారం దిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో వందేమాతర గేయం 150 ఏళ్ల స్మారకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. వందేమాతరం గీతం అనేది దేశమాత ఆరాధన, సాధన అని ప్రధాని మోదీ అన్నారు. ఈ జాతీయ గేయం అందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుందని, ఆ శబ్దం అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందని, వందేమాతరం సామూహిక గీతాలాపన ఒక అద్భుత అనుభవమన్నారు. ఒకే లయ, స్వరం, భావంతో గీతాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని, వందేమాతరం స్మారకోత్సవాలు దేశ ప్రజలకు ప్రేరణ ఇస్తాయన్నారు. ప్రతి గీతానికి ఒక మూల భావం, సందేశం ఉంటాయని, వందేమాతరం మూల భావం భారత్ అని మోదీ చెప్పారు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వందేమాతరం స్ఫూర్తిని అందించిందని తెలిపారు. దేశంలో జాతీయ ఐక్యతను, జాతీయతా భావనలను పెంపొందించడంలో అది కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ ఏడాది నవంబరు 7 నుంచి 2026 సంవత్సరం నవంబరు 7 వరకు దేశవ్యాప్తంగా 'వందేమాతరం' స్మారకోత్సవాలు ఘనంగా జరుగుతాయని ప్రధాని వెల్లడించారు. 'వందేమాతరం' 150 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా స్మారక స్టాంపు, నాణెంను ఆయన విడుదల చేశారు. "వందేమాతర గేయంలోని పదాలు మనల్ని చరిత్ర పుటల్లోకి తీసుకెళ్తాయి. అవి మన వర్తమానాన్ని కొత్త విశ్వాసంతో నింపుతాయి. మన భవిష్యత్తుకు భరోసాను ఇస్తాయి. సంకల్పిస్తే సాధించలేని లక్ష్యమంటూ ఏదీ ఉండదనే ధైర్యాన్ని భారతీయులకు వందేమాతరం ప్రసాదిస్తుంది. నవంబరు 7 ఒక చారిత్రక దినోత్సవం. ఎందుకంటే మనం వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలను ఈరోజే ప్రారంభిస్తున్నాం. దీనికి సంబంధించి నిర్వహించబోయే కార్యక్రమాలు కోట్లాది మంది భారతీయుల్లో కొత్త శక్తిని నింపుతాయని ప్రధాని మోడీ తెలిపారు.

## ఎస్ఐబీపీలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులకు
# చంద్రబాబు ఆమోదం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ.1,01,899 కోట్ల పెట్టుబడుల స్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 85,870 ఉద్యోగాల కల్పన జరగనుంది. మూడు మెగా సిటీలు, 15 ఇండస్ట్రియల్ జోన్ల అభివృద్ధికి 12వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడంతో పాటు అవి కార్యరూపం దాల్చేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. మొత్తంగా రూ.8,08,899 కోట్ల పెట్టుబడులు: సచివాలయంలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. పరిశ్రమల కోసం అవసరమైన భూములు, విద్యుత్ లభ్యత కూడా ఉండేలా చూడాలని సీఎం సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన 16 నెలల్లో జరిగిన 12 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా మొత్తంగా రూ.8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05,870 ఉద్యోగాలు రానున్నాయి. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యతని సీఎం స్పష్టం చేశారు. పెట్టుబడులు పెట్టే పరిశ్రమల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఆయా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులను త్వరితగతిన వచ్చేలా శ్రద్ధ పెట్టాలన్నారు. గత పాలకులు భూమి కేటాయించినా ఇప్పటికీ ప్రారంభం కాని ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో సమీక్షించాలని దిశానిర్దేశం చేశారు. ఏ ప్రాజెక్టులైనా నిర్మాణ పురోగతి లేకపోతే అనుమతులు రద్దు చేయాలని ఆదేశించారు.

## ఉనికి కోల్పోతానన్న భయంతో జగన్ అసత్యాలు: ఆనం



**ప్రకాశం, పతాకం న్యూస్:** ఉనికి కోల్పోతానన్న భయంతో జగన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. ప్రతిపక్ష నేత అర్హత కూడా జగన్ సంపాదించుకోలేక పోయారంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం పని చేయకపోతే జగన్ అసెంబ్లీకి వచ్చి చర్చించాలని అన్నారు.

## 150 సంవత్సరాల స్ఫూర్తికి నా వందనం: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** జాతీయ గేయం 'వందేమాతరం' రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన 'ఎక్స్' వేదికగా ఒక ట్వీట్ చేశారు. "150 సంవత్సరాల స్ఫూర్తికి నా వందనం" అంటూ జాతీయ గేయానికి నీరాజనాలర్పించారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ పవిత్ర గీతం మన స్వాతంత్ర్య సమరయోధుల్లో గొప్ప ఐక్యతా భావాన్ని రగిలించిందని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. ఆ స్ఫూర్తే మనందరికీ ఆదర్శమని తెలిపారు.

## ఏపీలో తెలంగాణకు చెందిన 'ప్రీమియర్ ఎనర్జీస్
# రూ.5,942 కోట్ల పెట్టుబడి: లోకేశ్

**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక రంగంలోకి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. తెలంగాణకు చెందిన ప్రముఖ సౌరశక్తి పరికరాల తయారీ సంస్థ 'ప్రీమియర్ ఎనర్జీస్' ఏపీలో రూ.5,942 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్‌లో ఈ మెగా సోలార్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 4 గిగావాట్ల సామర్థ్యంతో టాప్‌కాన్ సోలార్ సెల్ యూనిట్, 5 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్ మరియు వేఫర్ తయారీ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో రాష్ట్రంలో ప్రత్యక్షంగా సుమారు 3,500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, అనుబంధ పరిశ్రమల ద్వారా పరోక్షంగా మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని లోకేశ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు భూ కేటాయింపుల ప్రక్రియను ప్రభుత్వం రికార్డు వేగంతో పూర్తి చేసిందని ఆయన వివరించారు. 2024 అక్టోబర్‌లో కంపెనీ ప్రతినిధులతో చర్చలు ప్రారంభం కాగా, కేవలం కొద్ది నెలల్లోనే, అంటే 2025 ఫిబ్రవరి నాటికి ఏపీఐఐసీ ద్వారా 269 ఎకరాల భూమిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ఓడరేవులకు సమీపంలో ఉండటం, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, అనుకూల పారిశ్రామిక విధానాల వల్లే ప్రీమియర్ ఎనర్జీస్ ఏపీని ఎంచుకుందని తెలిపారు. ఈ పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఒక ముఖ్యమైన సోలార్ తయారీ




కేంద్రంగా (హబ్) మారనుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 7 గిగావాట్లకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశంలో రెండో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీదారు అయిన 'ప్రీమియర్ ఎనర్జీస్'కు ఏపీకి స్వాగతం పలుకుతున్నామని, ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి, యువతకు హరిత ఉద్యోగాల కల్పనకు ఎంతగానో దోహదపడుతుందన్నారు.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం
పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను
బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు
సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## 'భద్రత ఏదీ'

ఇటీవల తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మన రవాణా వ్యవస్థలోని లోపాలను బట్టబయలు చేస్తున్నాయి. రహదారి భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఉద్యోగం, ఉపాధి, పరామర్శ, సందర్శన తదితర అవసరాలకు ప్రయాణాలు చేయడం ఏ ఒక్కరికైనా తప్పనిసరి. ఇలా ప్రయాణమై సాగే వాళ్లు భద్రంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి. అందుకు తగ్గట్టుగా రహదారులు, వాహనాలు, రవాణా వ్యవస్థ సన్నద్ధమై ఉండాలి. కానీ, ఏం జరుగుతోంది మనదేశంలో? ప్రపంచంలోని వాహనాల్లో మనదేశంలో ఉన్నవి ఒక్క శాతం కాగా, రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య మాత్రం 11 శాతం! మన రోడ్డు భద్రతా వ్యవస్థలోని లోపాలను, ప్రమాణాల్లోని డొల్లతనాన్ని ఈ లెక్క వెల్లడి చేస్తోంది. దేశంలో ఏటా దాదాపు 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగి, 2 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడ్డవారి సంఖ్య దీనికి రెట్టింపు ఉంటుంది. ఈ ప్రమాదాల్లో 70 శాతం అతివేగం వల్లే సంభవిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. రాంగ్‌రూట్లో నడపటం, మద్యం సేవించి నడపటం వంటి కారణాలు తరువాతి వరుసలో ఉన్నాయి. ప్రమాదాల్లో అత్యధిక భాగం జాతీయ రహదారుల మీదనే జరుగుతున్నాయి. ఎక్కడ, ఎందుకు, ఏ సమయంలో, ఏ పరిస్థితుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయో సంబంధిత శాఖల వద్ద స్పష్టమైన గణాంకాలూ, సోదాహరణమైన వివరాలూ ఉన్నప్పటికీ- వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలే ప్రశ్నార్థకం! ప్రయాణాలకు వీలుగా రహదారులను భద్రంగా ఉంచటం, వేగ నియంత్రణ, వాహనాల స్థితిపై తనిఖీ, ప్రమాణాల పాటింపు వంటి చర్యలను పటిష్టవంతంగా అమలు చేస్తే - ఇన్ని ప్రమాదాలు జరిగి ఉండేవి కావు. ఈ మధ్య జరిగిన ప్రమాదాల్లోనే పాలకుల తరఫున అనేక డొల్లతనాలు, నిర్లక్ష్యాలూ బయటపడ్డాయి. ప్రయివేటు బస్సులు నడపటంలో ప్రమాణాలకు నీళ్లొదలటం స్పష్టంగా కనిపిస్తోంది. వేగంపై నియంత్రణ లేకపోవటం, సిట్టింగ్ ప్రయాణ అనుమతులున్న బస్సులను స్లీపరు కోచ్‌లుగా మార్చటం, భద్రతా పద్ధతులను పట్టించుకోకపోవటం, డ్రైవర్లకు సరైన శిక్షణ, నిర్వహణపై అవగాహన లేకపోవటం %% పెను ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రజారవాణాను ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టటంతోనే ప్రయాణ భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలను నివారించాలంటే ఈ అంశాలపై తప్పకుండా చర్చించాలి. సరైన ప్రమాణాలను, పద్ధతులను ఆచరించాలి.

పాలకులు జాతీయ రహదారులను ఆదాయ వనరులుగా ఉపయోగించుకోవటంపై చూపుతున్నంత శ్రద్ధ- వాటిని భద్రతా మార్గాలుగా మలచటంపై కనపరచటం లేదు. హైవేలు అంతటా నెలకొల్పిన టోల్‌ప్లాజాలు ఏటా వేలాది కోట్ల రూపాయలను వాహనదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిపై రూపాయి పెట్టుబడి పెట్టి, రూ.3.31ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అంటే పెట్టుబడికి మూడింతలు పైగానే రాబడిని పొందుతోంది. కానీ, రహదారి భద్రతపై చూపుతున్న శ్రద్ధ, పెడుతున్న ఖర్చూ అంతంతమాత్రంగానే ఉంది. ఆదాయంలో అత్యధిక భాగాన్ని రిలయన్స్ వంటి కార్పొరేట్ల ఖజానాలోకి ప్రవహించే విధంగానే హైవేల నిర్వహణ సాగుతోంది. భద్రమైన రహదారులు, సురక్షితమైన ప్రయాణం ఒక దేశ అభివృద్ధికి అచ్చమైన కొలమానం. ప్రపంచంలో జరిగే ప్రమాదాల్లో నూటికి 18 మన దగ్గరే జరుగుతున్నందున %-% మనదేశ రవాణా వ్యవస్థ ఇంకా అస్తవ్యస్త దేశాల సరసనే ఉంది. లాభాలే పరమార్థంగా సాగే ప్రైవేటు రవాణా వ్యవస్థ భద్రతకు ఇచ్చే ప్రాధాన్యం అంతంతమాత్రంగానే ఉంటుంది. రైల్వేల్లో అయినా, రోడ్డు రవాణాలో అయినా-నైపుణ్యమూ, నాణ్యతా ఉన్న సిబ్బంది సేవలు అవసరమవు తాయి. కీలకమైన విభాగాల్లో శాశ్వత ఉద్యోగులను నియమించకుండా ప్రయివేటు, కాంట్రాక్టు సేవలకు వదిలేయటం అంటే భద్రతకు భరోసా లేనట్టే లెక్క! కాలం చెల్లిన వాహనాలను రోడ్డెక్కకుండా చేయడం, ఉన్న వాహనాల కండిషన్‌పై నిరంతర తనిఖీలు జరపటం తక్షణ అవసరం. రాజకీయ జోక్యాలతోనూ, ఇతరత్రా కారణాలతోనూ ప్రైవేటు ట్రావెల్స్ పట్ల ఉదాసీనత ప్రదర్శించటాన్ని మానుకోవాలి. భద్రమైన ప్రయాణం ప్రతి ఒక్కరి హక్కు. దానిని కాపాడే బాధ్యత ప్రభుత్వానిది!

## ఉల్లి రైతులకు హెక్టార్టుకు రూ.50వేల ఆర్థిక సాయం అందించనున్న ప్రభుత్వం



**అమరావతి, పతాకం న్యూస్:** ఉల్లి రైతుల్ని ఆదుకోవాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం హెక్టారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ఇవ్వబోతోంది. ఫలితంగా కర్నూలు, కడప జిల్లాల్లోని 20,913 మంది రైతులకు రూ. 104.57 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ఈ-పంట ఆధారంగా ఈ సహాయం అందుతుంది. దీనివల్ల 45 వేల ఎకరాల్లో ఉల్లి పండించిన రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఉల్లి కొనుగోలులో మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ కీలక పాత్ర పోషించాయి. క్వింటాల్ ఉల్లి రూ.1,200 చొప్పున, మొత్తం రూ.18 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశాయి. దీనికి సంబంధించి రూ.10 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించారు. మిగిలిన రూ.8 కోట్లను కూడా త్వరలోనే అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు నిన్న వెల్లడించారు. వివిధ పరిస్థితుల కారణంగా ఈసారి క్వింటా ఉల్లి రూ.600 కంటే ఎక్కువ ధర పలకలేదు. దీంతో ప్రభుత్వం క్వింటా రూ.1,200 చొప్పున సుమారు లక్షా 39 వేల క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసింది. కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లిని దాదాపుగా సేకరించింది. కొంత ఉల్లిని రైతుబజార్లకు, మరికొంత ఉల్లిని వ్యాపారులకు తరలించి విక్రయించింది. అయినప్పటికీ కొంతమంది రైతుల వద్ద ఇంకా ఉల్లి మిగిలి ఉంది. గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని గుర్తించిన ప్రభుత్వం.. ఉల్లి సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ.50వేల చొప్పున అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీనికి సంబంధించిన నియమనిబంధనల మేరకు లబ్దిదారులకు అందించబోతున్నారు.

## 50 విమానాలను మోసుకెళ్లే సామర్థ్యం కలిగిన భారీ యుద్ధ నౌకను ప్రారంభించిన చైనా



**బీజింగ్:** చైనా అత్యంత శక్తిమంతమైన 'ఫుజియాన్' (టైప్-003) యుద్ధ నౌకను ప్రారంభించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ విమాన వాహక నౌకను ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రారంభించారు. హైనాన్ ద్వీపంలోని సైనిక నౌకాశ్రయంలో దీనికి సంబంధించిన వేడుకలు జరిగినట్లు స్థానిక అధికారక మీడియా వెల్లడించింది. జిన్‌పింగ్ యుద్ధ నౌకను పరిశీలించారని పేర్కొంది. 316 మీటర్ల పొడవు, 80 వేల టన్నుల బరువు కలిగిన ఫుజియాన్ విమాన వాహక నౌక దాదాపు 50 విమానాలను మోసుకెళ్లగలదు. ఇది చైనాకు చెందిన మూడవ అత్యంత ఆధునిక యుద్ధ నౌక. విద్యుదయస్కాంత ఆధారిత వ్యవస్థ అయిన ఈఎంఏఎల్ఎస్‌ను ఇందులో వినియోగించారు. ఈ తరహా సాంకేతికతను అమెరికాకు చెందిన గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ శ్రేణి విమాన వాహక నౌక మాత్రమే ఇప్పటివరకు వినియోగిస్తోంది. ఈ నౌక బీజింగ్‌కు వ్యూహాత్మక సాధనంగా ఉపయోగపడుతుందని, దేశ గౌరవాన్ని పెంచుతుందని చైనా ఇటీవల పేర్కొంది. ఫుజియాన్ తర్వాత టైప్-004 విమాన వాహక నౌకను నిర్మించేందుకు కూడా చైనా సన్నాహాలు ప్రారంభించింది. దీనిని ఈఎంఏఎల్ఎస్‌తో పాటు అణు సామర్థ్యంతో నిర్మించాలని చైనా ప్రణాళికలు రచిస్తోంది. అమెరికాతో పోటీపడుతూ చైనా తన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది.

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సాంకేతిక సమస్య.. 100 విమానాలు ఆలస్యం




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తింది. ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక లోపం తలెత్తడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దాదాపు 100 కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆటో ట్రాక్ సిస్టమ్‌కు సంబంధించిన సమాచారం అందించే ఆటోమెటిక్ మెసేజ్ స్విచ్చింగ్ వ్యవస్థలో సమస్య ఎదురైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు విమాన ప్రణాళికలు ఆటోమెటిక్‌గా అందడం లేదని పేర్కొన్నాయి. ఏటీసీ సిబ్బంది మ్యానువల్‌గా విమానాల షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నాయని తెలిపాయి. ఫలితంగా అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని వెల్లడించాయి. ఇప్పటివరకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100కు పైగా విమానాలు ఆలస్యమయ్యాయని అధికారిక వర్గాలు తెలిపాయి. విమానాల షెడ్యూల్ మార్పునకు సంబంధించి ఎయిర్‌లైన్లు ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిరిండియా ప్రయాణికులకు అడ్వైజరీలు జారీ చేశాయి. అసౌకర్యానికి క్షమించాలని కోరాయి. మరోవైపు, ఆలస్యంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టులోని చెక్ఇన్, ఇతర కౌంటర్ల వద్ద భారీ రద్దీ నెలకొంది. సమస్యను పరిష్కరించేందుకు సాంకేతిక సిబ్బంది ప్రయత్నిస్తున్నారని, ఇందుకు కొన్ని గంటల సమయం పట్టచ్చని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ సమస్య కారణంగా లఖ్‌నవూ, జైపుర్, చండీగఢ్, అమఅత్‌సర్ ఎయిర్‌పోర్టుల్లోనూ విమానాల రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది.

## వీధికుక్కలను తొలగించాల్సిందే : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** విద్యాసంస్థలు, ఆస్పత్రులు, క్రీడాసముదాయాలు, ఇతర ప్రదేశాల నుండి వీధి కుక్కలను తొలగించాలని అన్ని రాష్ట్రాలు, యుటిలను సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ ప్రదేశాల్లో కుక్కలు ప్రవేశించకుండా కంచెలు వేయాలని, క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని పేర్కొంది. స్టెరిలైజేషన్ తర్వాత కుక్కలను తిరిగి అదే ప్రాంతాల్లో వదలకూడదని పేర్కొంది. ఈ ప్రాంగణాల్లోకి వీధికుక్కలను తిరిగి అనుమతించడంతో ఆ స్థలాలను భద్రత మరియు ప్రజారోగ్యం, భద్రతను కాపాడాలి అన్న ఉద్దేశ్యం దెబ్బతింటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ బహిరంగ ప్రదేశాల్లో ప్రస్తుతం నివసిస్తున్న అన్ని వీధి కుక్కలను బంధించి, స్టెరిలైజ్ చేసి, వ్యాక్సిన్లు వేయాలని కూడా ఆదేశించింది. వాటిని తిరిగి అదే ప్రాంతంలో విడిచి పెడితే కోర్టు ఆదేశం, ఉద్దేశాన్ని దెబ్బతీస్తుందని జస్టిస్ సందీప్ మెహతా పేర్కొన్నారు. వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించిన సంగతి తెలిసిందే. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా, వైద్యసంస్థలు, రవాణా కేంద్రాలు మరియు క్రీడా భవనాల నుండి ఎనిమిది వారాల్లోగా వీధికుక్కలను తరలించాలని ఆదేశించింది. ప్రతిసంస్థ నిర్వహణ, నిఘాకు బాధ్యత వహించేలా నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించింది. స్థానిక సంస్థలు, పంచాయితీలు రానున్న మూడు నెలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, నివేదికలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.

## 2026 లోపు వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం: నిమ్మల



**ప్రకాశం జిల్లా, పతాకం న్యూస్:** వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2026 లోపు పూర్తి చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి 1996లో సీఎం చంద్రబాబు భూమి పూజ చేశారని గుర్తు చేశారు. 30 ఏళ్ళుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగటంపై చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రతి 15 రోజులకోసారి చంద్రబాబు ప్రాజెక్టు నిర్మాణంపై రివ్యూ చేస్తున్నారని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు పగలు, రాత్రి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వెలిగొండ నిర్మాణం పూర్తి కాకుండానే గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ ప్రాజెక్టును ప్రారంభించారని మంత్రి రామానాయుడు ఆరోపించారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన జగన్‌కు ప్రకాశం జిల్లా ప్రజల్ని మోసం చెయ్యడం లెక్కకాదని ఆరోపించారు. జగన్ చర్యలు హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. జగన్ మానసిక పరిస్థితి విచిత్రంగా ఉందని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో నిర్వాసితులకు ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. హంద్రీనివా రాయలసీమకి జీవనాడి అని స్పష్టం చేశారు. 2025లోనే హంద్రీనివా ప్రాజెక్టు పూర్తి చేశామని మంత్రి రామానాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## పిఆర్టీయు ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల ప్రతిభ పోటీల్లో ఆకట్టుకున్న మట్టి కళాకృతులు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం: పిఆర్టియు జిల్లా అధ్యక్షులు డి. గోపినాథ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల ప్రతిభ పాటల పోటీలలో భాగంగా శుక్రవారం మట్టి మరియు క్లేతో వివిధ కళాకృతుల పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు వివిధ మండలాల నుండి పాల్గొని అద్భుతమైన మట్టి కళా ప్రదర్శనలను రూపొందించారు. జూనియర్ మరియు సీనియర్ విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించగా, చిన్నారులు తమ సృజనాత్మకతను చాటారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా తోట ప్రసాద్, శ్రీనివాసరావు వ్యవహరించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన క్రికెట్ శ్రీ చరణి

(మొదటిపేజీ తరువాయి)

విజయానికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఆమెకు రూ.2.5 కోట్ల నగదు బహుమతిని అందజేయనున్నట్టు తెలిపారు. దీంతో పాటు కడపలో ఇల్లు నిర్మించుకునేందుకు వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయిస్తున్నామని, గ్రూప్-1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# మెడికల్ కళాశాలలు పీపీపీ విధానాన్ని అడ్డుకుందాం: ఎమ్మెల్యే మత్స్యలింగం



**అనంతగిరి, పతాకం న్యూస్:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ, వైఎస్ఆర్సీపి కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. అనంతగిరి మండల కేంద్ర పరిధిలో గల ఎగువశోభ గ్రామ పంచాయతీలో పరిధిలో ఉన్న పెద్ద ఊరు, మర్ద గూడ గ్రామాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడిన,మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా సిపిఐ(ఎం) పార్టీ, జెడ్పిటిసి సభ్యులు దిసరి గంగరాజు మద్దతు తెలపడం శుభపరిణామమని, ఇది ప్రజా ఉద్యమానికి మరింత బలం చేకూర్చుతుందని అన్నారు.

కార్యక్రమంలో అనంతగిరి వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ,మండల ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు,మాజీ అనంతగిరి మండల జడ్పీటీసి దూరు గంగన్న దొర, ఎగువ శోభ సర్పంచ్ కొర్ర సింహాద్రి, వాలసి సర్పంచ్ సన్యాసిరావు, లంగుపర్తి సర్పంచ్ జన్ని సన్యాసి, కోనాపురం సర్పంచ్ రఘునాథ్, మాజీ వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, వైసీపీ మండల పార్టీ ఉపాధ్యక్షులు పాడి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి డోనోరు దానియేలు, మండల కార్యవర్గ సభ్యులు పోలయ్య, వార్డు సభ్యులు సుజాత, వైసిపి నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేసేంతవరకు
# పోరాడుతాం: బాబ్జి



**నక్కపల్లి, పతాకం న్యూస్:** బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక ఉద్యమం శుక్రవారం నాటికి 55 రోజులకు చేరుకుంది ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు సిపిఐ జిల్లా సభ్యులు బి. బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వాలు మత్స్యకారుల ప్రాణాలతో చెలగాటం ఆడే విధానం సరైనది కాదని రాజయ్యపేట మత్స్యకారులు గత 55 రోజులుగా చేపల వేటలకు పోకుండా శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నారని ఆకలి కడుపులతో ప్రాణాలైనా అర్పిస్తాం కానీ బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక ఉద్యమం బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేసేంతవరకు కొనసాగుతుందన్నారు ధర్నా శిబిరం వద్దనే వంటావార్పు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పోలీసులు అమాయకపు మత్స్యకారులపై ఉద్యమాన్ని అణిచివేయడానికి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎలాంటి చర్యలు సరైనవి కాదని అన్నారు భవిష్యత్తులో ఈ ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోశాల సోము, మాజీ ఎంపీటీసీ తాతీలు,స్వామి, కాశి, పైడితల్లమ్మ, నూకమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ఏ.ఎల్.పురంలో రూ.23.10 లక్షలతో విజ్ఞాన శాస్త్ర ల్యాబ్ భవనం శంకుస్థాపన



**గొలుగొండ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ప్రభుత్వ ఉన్నత విద్యను బలోపేతం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంతో అమలవుతున్న పీఎం శ్రీ పథకం కింద ఏ.ఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.23లక్షల పదివేల రూపాయలు మంజూరయ్యాయి.ఈ నిధులతో నిర్మించనున్న విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల భవనమునకు గురువారం సర్పంచ్ లోచల సుజాత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లోచల సుజాత మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక ప్రయోగశాల సౌకర్యం అందనుందని,ఇది విజ్ఞాన శాస్త్ర అవగాహనను పెంచుతుందని సర్పంచ్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ల్యాబ్ పూర్తయితే విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ భవనం పూర్తయితే గొలుగొండ మండలంలోని 300 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. కార్యక్రమం అనంతరం స్థానికులు సర్పంచ్‌ను అభినందించారు.

# సీఐటీయూ నేత కామ్రేడ్ రమేష్‌కు నివాళులు

**నర్సీపట్నం, పతాకం న్యూస్:** సీఐటీయూ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్.రమేష్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కా.రమేష్ చిత్రపటానికి సిఐటియు పూర్వపు నాయకులు ఎ.అజశర్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ "కామ్రేడ్ రమేష్ చిన్నతనంలో బాల కళాకారుడిగా, అనంతరం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుడిగా, ఆపై సీఐటీయూ నాయకుడిగా ప్రజల కోసం జీవితాంతం పోరాడారు" అన్నారు. ప్రజలు తిరగబడకుండా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఐద్వా నాయకులు ఎల్.గౌరీ, కేవీ సూర్యప్రభ, ఈ.చిరంజీవి, కె.రామకృష్ణ, శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇష్టారాజ్యంగా
# ఇసుక అక్రమ తవ్వకాలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** శారదా నదిలో వరద తగ్గుముఖం పట్టడంతో ఇసుకాసురులు అక్రమ తవ్వకాలకు తెర తీస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాల వద్ద ఇసుక తవ్వకాల (అనధికారిక) కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నారు. తాజాగా గవరవరంలో ఇసుక తవ్వకాలకు రెండు రోజుల క్రితం వేలం పాట నిర్వహించినట్టు సమాచారం. ప్రభుత్వం కల్పించిన ఉచిత ఇసుక పథకాన్ని కొంతమంది అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాస్తవంగా జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. అయితే ఇళ్ల నిర్మాణాలు, మరమ్మతు పనుల కోసం స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో ఇసుకను తవ్వి, టైరు బండ్లతో తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అయితే ముందుగా స్థానిక సచివాలయంలో అనుమతులు తీసుకోవాలి. కానీ గ్రామాల్లో రాజకీయ పెత్తనం చెలాయిస్తున్న నేతలు, నదుల్లోని ఇసుక వనరులను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపిస్తున్నారు. దీంతో నదిగట్లు కోతకు గురవుతున్నాయి. వంతెనలు దెబ్బతింటున్నాయి. కాజ్‌వేలు కొట్టుకుపోతున్నాయి. మండలంలోని గవరవరం వద్ద నది గర్భంలో ఇసుకను పూర్తిగా తోడేయడంతోపాటు, నది గట్లను కూడా ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇటీవల తుఫాన్ సమయంలో వచ్చిన వరద ఉధృతికి నది ఒడ్డున ఉన్న జడ్పీ హైస్కూల్, ఇతర ప్రభుత్వ భవనాలు కూలిపోతాయేమోనని స్థానికులు ఆందోళన చెందారు. ఇదిలావుండగా సుమారు రెండున్నర నెలల నుంచి వర్షాల కారణంగా శారదా నదిలో వరద ప్రవాహం అధికంగా వుంది. ఎగువనున్న జలాశయాలు నిండడంతో గేట్లు ఎత్తుతున్నారు. దీంతో నదిలో వరద ఉధృతి విపరీతంగా పెరిగి, ఇసుక తవ్వకాలు జరపలేని పరిస్థితి ఏర్పడింది. గత వారం సంభవించిన తుఫాన్ కారణంగా నదులు ఉధృతంగా ప్రవహించాయి. ఇదే సమయంలో పలుచోట్ల ఇసుక మేటలు వేసింది. నదిలో వరద బాగా తగ్గడంతో ఇసుకాసురులు రంగంలోకి దిగారు. ఇసుక తవ్వకాల కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నారు. గవరవరంలో ఇసుక తవ్వకాలకు మంగళవారం వేలం పాట నిర్వహించినట్టు సమాచారం. ఇందులో అధికారంలో వున్న కూటమి పార్టీలతో పాటు, ప్రతిపక్ష వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. వీరి తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నదిలో, రక్షణ గట్లకు సమీపంలో ఎడాపెడా ఇసుక తవ్వకాలు జరిపితే భవిష్యత్తులో శారదా నది గట్లకు గండ్లు పడి గ్రామాన్ని వరద నీరు ముంచెత్తుతుందని ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, గనులు, జలవనరుల శాఖ అధికారులు స్పందించి, శారదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించాలని గవరవరం గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో
# వందే మాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** కొయ్యూరు మండలం,మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వందే మాతరం గీతం 150వ వార్షికోత్సవం విద్యార్థినుల హృదయాల్లో నిండిన దేశభక్తితో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డా.కె.సుధ ఆధ్వర్యంలో,హిస్టరీ విభాగం ఉపాధ్యాయురాలు జె.భువనేశ్వరి దేవి సమన్వయంతో జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.కె.సుధ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందే మాతరం గీతం పోషించిన పాత్రను అది ప్రజల్లో నింపిన జాతీయ ఐక్యతా స్ఫూర్తిని వివరించారు.హిస్టరీ ఉపాధ్యాయురాలు జె.భువనేశ్వరి దేవి మాట్లాడుతూ బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందే మాతరం గీతం దేశభక్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, అది భారత జాతికి ప్రేరణాస్వరూపమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి గీతాలు ఆలపించారు.

## డిసెంబరు కల్లా
# ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో పేదల కోసం శివారు ప్రాంతాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ఎండీ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. విశాఖ విచ్చేసిన ఆయన ఆనందపురం మండలం రామవరం, అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గంగవరంలో ఇళ్ల కాలనీలను సందర్శించి కాంట్రాక్టర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని స్పష్టంచేశారు. లేఅవుట్‌లలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్, పచ్చదనం తదితర అంశాలపై చర్చించారు. కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లను అధికారులు తనిఖీ చేసిన అనంతరం యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తిస్థాయిలో వివరాలు సమర్పించిన తరువాత మాత్రమే బిల్లులు మంజూరవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శివారుల్లో 65 లేఅవుట్‌లలో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా, ఇప్పటివరకూ 32 వేలు పూర్తిచేసినట్టు తెలిపారు. పలు కారణాలతో 20 వేల ఇళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. మిగిలిన 50 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఇప్పటివరకూ ప్రారంభించని ఇళ్లపై తరువాత నిర్ణయం తీసుకుంటామని ఎండీ చెప్పారు. అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుతో కలిసి జిల్లా హౌసింగ్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షిస్తూ, పనులు వేగవంతం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మెటీరియల్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్.సత్తిబాబు, ఎస్ఈ కృష్ణయ్య, ఈఈలు సూరిబాబు, సుబ్రహ్మణ్యం, డీఈ రామకృష్ణ, మేనేజర్ మేరీ గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ



**నక్కపల్లి, పతాకం న్యూస్:** ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గిరిజన గ్రామాలైన చింతపల్లి మండలంలోని కోరుకొండ ,కుడుముల ,రాళ్ల బంద , బలపం ,వెలంజివ్వి, గిల్లబంద, చెరువూరు, తడ్డపల్లి మొదలైన గిరిజన గ్రామాలలో చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ మిత్రుల సహకారంతో పర్యటించి ఆయా ప్రాంతాలలోని విద్యార్థులకు అవసరమైన పలకలు, పెన్నులు, చెక్ రూళ్ళు పుస్తకాలు ,ఎక్కాల పుస్తకాలు మొదలగు విద్యా సామాగ్రిని అందజేయడం జరిగింది . గిరిజన ప్రాంతాలలో వెనుకబడిన గిరిజన విద్యార్థులు విద్యలో రాణించి అత్యున్నతమైన స్థాయికి ఎదగాలన్న ఆశయంతో తన వంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించానని ఈ కార్యక్రమాన్ని మున్ముందు కూడా ఇలాగే కొనసాగిస్తానని ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ తెలియజేశాడు.

# మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చోద్యంలో కోటి సంతకాల ఉప్పెన



**గొలుగొండ, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేట్ పరం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాలు కార్యక్రమం శుక్రవారం చోద్యం గ్రామంలో ఘనంగా కొనసాగింది. మండల వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ నేతృత్వంలో ఇంటింటా తిరిగి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కార్పొరేట్ దోపిడీకి అప్పగించడం సరికాదని, పేద విద్యార్థుల భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైద్య విద్యను కాపాడుకోవాలని వివరిస్తుంటే ప్రజలు స్వచ్ఛందంగా సంతకం చేస్తున్నారని సర్పంచ్ సుజాత ఉత్సాహంగా తెలిపారు. రెండు గంటల్లోనే గ్రామంలో 1,200కు పైగా సంతకాలు సేకరించడం హైలైట్‌గా నిలిచింది.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల లక్ష్యాన్ని చేరుకుంటామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు ఇంటింటి ప్రచారం కొనసాగనుంది.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు కొరుప్రోలు ఫణి శాంతారాం, జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత ఏ.ఎల్.పురం సర్పంచ్, పరవాడ కపిలేశ్వరరావు,నానితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## బీజేపీకి కీలుబొమ్మగా మారిన ఈసీఐ : షర్మిల



**అమరావతి, పతాకం న్యూస్:** కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పుడు స్వయం ప్రతిపత్తి సంస్థ కాదని, బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మోడీ మోసం మీద, ఎన్నికల సంఘం దగాపై రాహుల్ గాంధీ హైడ్రోజన్ బాంబు పేల్చారన్నారు. ఈ దొంగ ఓట్లు లేకుంటే కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలిచేది అని చెప్పారు. ఎన్నికల సంఘం తన బాధ్యతను విస్మరించి బిజెపి పక్షాన పనిచేస్తోందని మండిపడ్డారు.ఓటర్ జాబితా, సిసిటివి ఫుటేజ్, డిజిటల్ డేటా వంటి ఆధారాలు ఇవ్వకుండా ఎన్నికల సంఘం దాచి పెడుతోందని తెలిపారు. బిజెపికి ఎన్నికల సంఘం మరో ఆర్ఎస్ఎస్ వంటి వ్యవస్థ అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన 'ఓట్ చోర్ %-% గద్దీ చోర్' ప్రచారానికి ప్రజలు విశేష స్పందన చూపారని చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి 17.65 లక్షల మంది ప్రజలు సంతకాలు చేసి ఈ ఉద్యమానికి మద్దతు తెలిపారని వివరించారు. ఈ సంతకాలను డిల్లీకి పంపిస్తున్నామని చెప్పారు.

## ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితుల వాదనలు పూర్తి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన విస్తృత కుట్ర కేసులో బెయిల్ కోసం ఆరుగురు నిందితులు చేసిన వాదనలు సుప్రీంకోర్టులో ముగిశాయి. ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షాదాబ్ అహ్మద్, మహ్మద్ సలీమ్ ఖాన్‌ల వాదనలను జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన బెంచ్ వింది. ఢిల్లీ పోలీసులు 11వ తేదీ నుండి తమ వాదనలు ప్రారంభిస్తారు. గురువారం నాటి విచారణలో షాదాబ్ అహ్మద్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ వాట్సాప్ చాట్‌లను చూసినట్లైతే, ఏ చాట్‌లోనూ తన క్లయింట్ భాగస్వామి కాదని కనిపిస్తోందని చెప్పారు. తన క్లయింట్ బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చినపుడు తమ వైపు నుండి ఎలాంటి జాప్యం కూడా జరగలేదని అయినా న్యాయం జరగడం లేదని అన్నారు. 27ఏళ్ల తన క్లయింట్ ఎన్‌డిఎస్ ఎంటర్‌ప్రైజెస్‌లో సూపర్‌వైజర్‌గా 2016 నుండి పనిచేస్తున్నారని చెప్పారు. దీంతో పిటిషనర్ల వాదనలు పూర్తయ్యాయి. సెప్టెంబరు 2నాటి ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఖలీద్ తదితరులు సుప్రీంను ఆశ్రయించారు. దాంతో సెప్టెంబరు 22న ఢిల్లీ పోలీసులకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. అప్పటి ప్రతిపాదిత పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో ఢిల్లీల్లో అల్లర్లు చోటు చేసుకున్నాయి. యుఎపిఎ, ఐపిసిలోని పలు నిబంధనల కింద ఈ కేసులో ఎఫ్ఐఆర్‌ను ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం నమోదు చేసింది. నిందితుల్లో చాలామందిపై అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దాంతో వేర్వేరు కోర్టుల్లో పలు బెయిల్ పిటిషన్లు దాఖలయ్యాయి. చాలామంది 2020 నుండి కస్టడీలోనే వున్నారు.

## 17న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: మల్లిబాబు




**చోడవరం, పతాకం న్యూస్:** చోడవరంలోని నూకాంబిక కళ్యాణ మండపం లో జరిగిన ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యలక మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. ఈ దాడి చేసిన వారి మీద చట్టపరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. జరిగిన దాడి మీద చీఫ్ జస్టిస్ గవాయి స్పందన అత్యంత హుందాతనంతో ఉందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే మనుషులుగా గుర్తించబడ్డాం అని తెలిపారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ మాట్లాడుతూ ఆ రాజ్యాంగం వల్లనే గవాయి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాబడ్డారు .అది జీర్ణించుకోలేకనే ఈ దాడి కి పాల్పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి విశాఖ జిల్లా ల నుండి ఢిల్లీకి వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ ఇంచార్జ్ తత్తరమూడి శ్రీనివాసరావు , అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యలక మల్లిబాబు, జిల్లా ఇన్చార్జి పోసుపల్లి వెంకట్రావు, మహాజన సోషలిస్ట్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఏలుసూరి ఘాటీలు కొల్లి చిన్న అప్పారావు, ఎంఈఎఫ్ అధ్యక్షులు నీటి పల్లి ముత్యాలరావు, ఖండేలా వెంకట్రావు, మోర్తా శ్రీనివాసరావు,కాకినాడ కనకేశ్వరరావు, గంపల చినరాజు,రవణమ్మ,మంజూర్ దీపక్, రాజశేఖర్, మంజేటి రాజు, మారేడు గుడి సతీష్, తదితరులు పాల్గొన్నారు

## ఉషోదయ డిగ్రీ కళాశాలలో వందేమాతరం గీతాలాపన



**చోడవరం, పతాకం న్యూస్ :** వందేమాతరం అనేది ఒక నినాదం కాదని ఇది యావత్ భారత దేశమును ఐక్యం చేసే బ్రిటిష్ ప్రభుత్వం నుండి భారతదేశానికి స్వతంత్రం సంపాదించి పెట్టిన భావవ్యక్తీకరణ ఆయుధం అని ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జే.రమణజీ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాల చోడవరం నందు ఉషోదయ విద్యా సంస్థలలో సామూహిక వందేమాతర గీతాలాపన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు వందేమాతర గీతం యొక్క చారిత్రక నేపథ్యాన్ని దాన్ని ఆవశ్యకత గురించి భారత స్వతంత్ర సంగ్రామ విశేషాలును విద్యార్థులకు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జే. రమణాజీ, డైరెక్టర్ జె. శ్యామ్ జీ, డీన్ ఎస్.వి.వాసు, ప్రిన్సిపల్ ఎస్.ఎన్ నాయుడు,జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.అప్పారావు,బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డా"ఎం.వి.ఎస్ మూర్తి,స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనువాస్, కోర్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎన్నికల చోరీల ద్వారా మోడీ ప్రధాని అయ్యారు: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** నరేంద్ర మోడీ ఎన్నికల చోరీలతో ప్రధానమంత్రి పదవిలోకి వచ్చారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ వ్యవస్థీకృతంగా ఎన్నికల చోరీలకు పాల్పడుతోందని, ఈ నిజాన్ని దేశ యువత (జెన్ జీ) ముందు ఆధారాలతో సహా ఉంచుతానని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'హెచ్-ఫైల్స్' మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, "మా దగ్గర చాలా ఆధారాలున్నాయి. ఈ ప్రక్రియను మేం కొనసాగిస్తాం. నరేంద్ర మోడీ ఎన్నికలను ఎలా దొంగిలించి ప్రధాని అయ్యారో జెన్ జీ యువతకు స్పష్టంగా వివరిస్తాం. బీజేపీ ఎన్నికలను దొంగిలిస్తోంది. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు" అని తీవ్రంగా విమర్శించారు. నకిలీ ఓట్లు, ఓటర్ల జాబితాలో నకిలీ ఫొటోలు వంటి అంశాలపై తాను చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం (ఈసీ) నుంచి ఎలాంటి స్పందన రాలేదని రాహుల్ అన్నారు. బీజేపీ ఈసీని వెనకేసుకొస్తోందని, కానీ తాము చేసిన ఆరోపణలను మాత్రం ఖండించడం లేదని ఆయన పేర్కొన్నారు. తాము చూపుతున్న ఆధారాలన్నీ ఈసీ నుంచి సేకరించినవే అని తెలిపారు. ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన లారిస్సా నెరీ అనే మహిళ ఫొటోను చేర్చడం ఒక చిన్న ఉదాహరణ మాత్రమేనని రాహుల్ అన్నారు. "అసలు సమస్య నరేంద్ర మోడీ, అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తుండటం. ఒకే వ్యక్తి బహుళ ఓట్లు వేయడం, ఒకే బూత్‌లో ఒక మహిళకు 200 ఫొటోలు ఉండటం వంటివి జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో ఇది జరిగింది. ఇప్పుడు బీహార్‌లోనూ అదే చేయబోతున్నారు" అని రాహుల్ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో బ్రెజిల్ మహిళ లారిస్సా నెరీ కూడా ఒక వీడియో ద్వారా స్పందించారు. "భారత్‌లో ఎన్నికల కోసం ఎవరో నా పాత ఫొటోను వాడుకుంటున్నారు. అది నేను 18-20 ఏళ్ల వయసులో ఉన్నప్పటి ఫొటో. నన్ను భారతీయురాలిగా చూపి ప్రజలను మోసం చేస్తున్నారు" అని ఆమె తన వీడియోలో పేర్కొన్నారు.

## క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం




**అనకాపల్లి, పతాకం న్యూస్:** ఆరోగ్యకరమైన జీవనశైలి కాన్సర్ రహిత జీవితానికి రహదారి అని క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ పరీక్షలు తోనే క్యాన్సర్ పై విజయం సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎం. హైమావతి అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవన శైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు (నాన్ కమ్యూనికేబుల్ డీసిజీస్ (ఎన్సీడి)- దీర్ఘ కాలిక వ్యాధులు) పెరుగుతున్నాయి. బి. పి, షుగర్ లతో పాటు ఈ రోజుల్లో క్యాన్సర్ కేసులు కూడా గణనీయంగా నమోదు అవుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తింప బడుతున్నాయి. వీటిలో చాలా కేసులు ఆలస్యంగా గుర్తించబడటంతో రేడియో, కీమో చికిత్సలు తీసుకోవలసిన అవసరం రావడం, తిరిగి నయం చేయలేని స్థితిలో వుండటంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ పరిస్థితులలో పేషెంట్ తో పాటు కుటుంబాలు అధిక ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి ని ఎదుర్కొంటున్నాయి. దీనికి ఒకే ఒక పరిష్కారం "ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం మరియు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడమన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని మందుల అవసరం తగ్గించుకోవాలని ఆరోగ్యకరమైన జీవనశైలి కాన్సర్ రహిత జీవితానికి రహదారి ముందస్తు పరీక్ష కాన్సర్ నుండి రక్ష క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యం' అనే నినాదంతో హాస్పిటల్ లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. కృష్ణారావు, డి.యల్.ఎ.టి. ఓ డా. స్వప్న, డి.ఐ.ఓ డా. చంద్ర శేఖర్ దేవ్, డి.పి.యమ్.ఓ డా.జె .ప్రశాంతి, డి.యస్.ఓ డా.వినోద్, జిల్లా యన్.సి.డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.ఎస్తేర్ రాణి, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్ సిబ్బంది పాల్గొన్నారు .

## రోడ్డు భద్రత కోసం పోలీసుల కృషి

### నాతవరం నుంచి తాండవ జంక్షన్ వరకు ఎస్ఐ తారకేశ్వరావు ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్



**నాతవరం, పతాకం న్యూస్:** నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, నాతవరం ఎస్సై వై. తారకేశ్వరరావు ఆధ్వర్యంలో మోటార్‌సైకిళ్లకు జరుగుతున్న వరుస ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రహదారి భద్రత చర్యలు చేపట్టారు. నాతవరం నుంచి తాండవ జంక్షన్ వరకు మరియు ములగపూడి నుంచి గన్నవరంకి మెట్ట వరకు (తుని-నర్సీపట్నం ప్రధాన రహదారి) జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రహదారి పక్కన పెరిగిన పొదలు, మొక్కలు, ఆకులు తొలగించారు. దీంతో రహదారి విశాలంగా మారి, వాహనదారులకు స్పష్టమైన దృశ్యం లభించింది. రాత్రి వేళల్లో కూడా ప్రమాదాలు జరగకుండా ఈ చర్య తోడ్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. రోడ్డు భద్రత కోసం ప్రజలు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి, హెల్మెట్ ధరించాలి, అతివేగం నివారించాలి అని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## తుఫాన్ బాధితులకు గొలుగొండలో నిత్యావసర వస్తువుల పంపిణీ



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలంలో తుఫాన్ ధాటికి నష్టపోయిన మండలంలోని గొలుగొండ,సీహెచ్ నాగాపురం గ్రామాల వరద బాధితులకు శుక్రవారం ఉదారంగా సాయం అందించారు టీడీపీ,జనసేన నాయకులు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం,1 కేజీ పంచదార,1 కేజీ బంగాళదుంపలు,1 కేజీ ఉల్లిపాయలు,1 కేజీ కందిపప్పు,1 కేజీ నూనె ప్యాకెట్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తామని టీడీపీ ఎప్పుడూ నిరూపించుకుంటూనే ఉంటుందని,ఈ నిత్యావసర వస్తువుల సాయం బాధితులకు కొంతమేర ఊరట కలిగిస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్,సత్తిబాబు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు గండేపల్లి రాము, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్,గ్రామ టీడీపీ అధ్యక్షులు పోతుల లోవరాజు, గొలుగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జనసేన నేత బోయిన చిరంజీవి,డీలర్ సూర్యప్రభ మరియు గొలుగొండ మరియు సీహెచ్ నాగాపురం కూటమి నాయకులు పాల్గొని కిట్‌లను అందజేశారు.

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన



**అమలాపురం, పతాకం న్యూస్:** క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని బండారులంక గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత సూచించారు. శుక్రవారం అమలాపురం మండలం బండారులంక పిహెచ్ సి వద్ద నుండి సర్పంచ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ గౌతమి, డాక్టర్ అమృత, అన్నామణి లు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ ఈ మాజీ సభ్యులు చింత శంకర్ మూర్తి, పిహెచ్సీ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బ్యాంక్‌ల జోలికి రావొద్దు..!

## ప్రైవేటీకరణతో దేశానికి విఘాతం.. సీతారామన్ వ్యాఖ్యలపైబ్యాంక్ యూనియన్ల ఆగ్రహం




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల ప్రైవేటీకరణపై ఆందోళనలు అవసరం లేదని.. దేశానికి ఎలాంటి విఘాతం కలుగదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై బ్యాంకింగ్ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దేశానికి ప్రభుత్వరంగ బ్యాంకులు ఎంతో సేవ చేస్తున్నాయని గుర్తు చేశాయి. ప్రాధాన్యత రంగాలకు ప్రభుత్వ రంగ బ్యాంక్‌లే మద్దతుగా నిలుస్తున్నాయని.. అలాంటి బ్యాంకులను ప్రయివేటీకరించాలనే ఉద్దేశాలు మానుకోవాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వ బ్యాంక్‌లకు మరింత మూలధన సాయం అందించి వాటిని బలోపేతం చేయాలని తొమ్మిది బ్యాంకింగ్ సంఘాలతో కూడిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 1969లో జరిగిన బ్యాంకుల జాతీయాకరణ వల్ల అనుకున్న ఫలితాలు రాలేదని మంత్రి సీతారామన్ ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. జాతీయాకరణ జరిగిన 50 ఏళ్ల తర్వాత కూడా అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయాయని విమర్శించారు. ప్రయివేటీకరణ ద్వారా బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరి దగ్గరకూ తీసుకెళ్లలేమన్నది తప్పుడు ఆలోచన అని పేర్కొన్నారు. మంత్రి ఈ వ్యాఖ్యలపై తాజాగా యుఎఫ్‌బియు భగ్గుమంది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పిఎంజెడివై) కింద 90 శాతం ఖాతాలు ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే తెరుచుకున్నాయని యుఎఫ్‌బియు తెలిపింది. ప్రాధాన్యత రంగాలకు, ప్రభుత్వ పథకాలు ఈ బ్యాంకుల ద్వారానే అందుతున్నాయని తెలిపింది. గ్రామీణ స్థాయిలో బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యత ప్రభుత్వ రంగ బ్యాంకులతోనే సాధ్యమైందని పేర్కొంది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ ఇంతటి పటిష్ఠంగా ఉండడానికీ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లే కారణమని యుఎఫ్‌బియు తెలిపింది. అలాంటి సంస్థలను ప్రయివేటీకరించడం ద్వారా దేశ ప్రయోజనాలకు విఘాతం జరుగుతుందని హెచ్చరించింది. ఉద్యోగ భద్రతతో పాటు, ప్రజల సొమ్ముకూ భద్రత ఉండబోదని తెలిపింది. ప్రయివేటీకరణ వల్ల కార్పొరేట్లకే తప్ప సాధారణ ప్రజలకు ప్రయోజనం ఉండబోదనని తెలిపింది. జాతీయాకరణ కంటే ముందు బ్యాంకులు పారిశ్రామిక వేత్తలు, బడా వ్యాపార సంస్థలకు మాత్రమే సేవలందించిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రభుత్వ బ్యాంక్‌లు మాత్రమే రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు, గ్రామీణ ప్రాంత రైతులకు రుణాలు ఇస్తున్నాయని స్పష్టం చేసింది. ఆర్థిక మాంద్యం, కరోన వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రభుత్వరంగ బ్యాంకులు దేశానికి మద్దతుగా నిలిచాయని గుర్తు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రయివేటీకరించబోమని కేంద్రం హామీ ఇవ్వాలని యుఎఫ్‌బియు డిమాండ్ చేసింది.

# ప్రమాదకరంగా గురవాయపాలెం మూసిబ్రిడ్జిపై గుంతలు



**ప్రకాశం జిల్లా, పతాకం న్యూస్:** అది అత్యంత కీలకమైన ఒంగోలు-నంద్యాల జాతీయ రహదారి. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. అలాంటి ముఖ్యమైన రహదారి పొదిలి మండలంలో అధ్వానస్థితికి చేరింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఛిద్రమైంది. చాలాచోట్ల మోకాలిలోతు నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా మార్కాపురం అడ్డరోడ్డు నుంచి విశ్వనాథపురం వరకు రోజుల తరబడి నీరు నిల్వ ఉండటం వలన గోతులు కనిపించక వాహనదారులు తరచూ ప్రమదాలబారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దానికితోడు రోడ్డుకు ఇరువైపులా సైడుకాలువల లేకపోవడంతో దుకాణాల ముందు యజమానులు మెరక కోసం మట్టి తోలడంతో రోడ్డు పల్లంగా మారింది. ముఖ్యంగా పెట్రోల్ బంక్ నుంచి ఆంజనేయస్వామి గుడి వరకు కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తుంది. ఈ పరిస్థితుల్లో పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి అక్కడక్కడా తక్షణ మరమ్మతులు చేపడుతున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం రోడ్డు దుస్థితి నానాటికీ దిగజారుతోంది. మర్రిపూడి అడ్డరోడ్డు వద్ద భారీ గుంతపడటంతో మునిసిల్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఉప్పలపాడులో నిత్యం నీరు నిల్వ ఉంటుంది. బస్టాండ్ సెంటర్ కావడంతో ప్రయాణికులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బకాయిలివ్వండి.. నేషనల్ హైవే కార్మికుల ఆందోళన



**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ అచ్చంపేట జంక్షన్ నుంచి పోర్టు వరకు నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలల నుంచి బకాయి పెట్టిన జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ కోకన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ నేషనల్ హైవే నిర్మాణం పనులు కాంట్రాక్టుకు తీసుకున్న సంతోష్ అనే కాంట్రాక్టర్ ఈ కార్మికులతో పనులు చేయించుకుని ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే వీరి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. బకాయి జీతాలు వెంటనే చెల్లించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేయడానికి సిద్ధపడుతున్నామని హెచ్చరించారు. కార్మికులకు జీతాలు ఇప్పించడంలో జిల్లా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకుని కాంట్రాక్టర్ వారితో కార్మికులు జీతాలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. గతంలో కూడా సదరు కాంట్రాక్టర్ కొంతమంది కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే ఆందోళన చేపట్టగా జిల్లా అధికారులు ఒత్తిడితో వారికి జీతాలు చెల్లించారని అదేవిధంగా ఇప్పుడు కూడా కార్మికుల బకాయి జీతాల కోసం అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# మూతపడిన రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రం



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రైల్వే స్కౌట్ అండ్ గైడ్స్ విషయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారుల తీరు విస్మయానికి గురి చేస్తోంది. ఇద్దరు ఉద్యోగుల మధ్య వైరం చినికి చినికి పిల్లలకు శిక్షణ ఆగిపోయే వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆరు నెలల నుంచీ డెన్ (శిక్షణ ఇచ్చే ప్రదేశం)కి తాళాలు వేసి ఉన్నా పట్టించుకొనే అధికారి కానరావడం లేదు. ఈ గొడవల కారణంగా తర్ఫీదు తర్వాత సంగతి.. పిల్లల సమయం పాడవుతుందనే ఉద్దేశంతో ఆ తల్లిదండ్రులు శిక్షణను పక్కన పెట్టేశారు. ఎంతో విశిష్ఠత ఉన్న సంస్థ పట్టాలు తప్పడం.. చిన్న పాటి సమస్యను పరిష్కరించలేని అధికా రుల నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఐదేళ్ల నుంచీ 25 ఏళ్ల వరకూ వివిధ అంశాల్లో ఆదివారాలు,బడుల సెలవు రోజుల్లో తర్ఫీ దు ఇస్తారు. దాదాపుగా మిలిటరీ ట్రైనింగ్ మాదిరిగానే ఉంటుంది. రోజూ ఉదయం, సాయంత్రం యోగా నేర్పి స్తారు. శారీరక దారుఢ్యంతో పాటు క్రమ శిక్షణ, మానసిక స్థైర్యం, ధైర్యం అలవడ తాయి. 25 ఏళ్లు వచ్చే సరికి సామర్థ్యాన్ని బట్టి రాష్ట్రపతి అవార్డు అందుకుంటారు. శిక్షణలో వివిధ ప్రాంతాల్లో క్యాంపులకు తీసుకెళతారు.రైల్వేతో పాటు ఇతర శాఖ ల్లోని ఉద్యోగ నియా మకాల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి ప్రత్యేక కోటా ఉం టుంది.రాజమహేంద్రవరంలో ఈ కోటా లో ఉద్యోగం వచ్చిన వారు ఇద్దరు ప్రస్తు తం పనిచేస్తున్నారు. విజయవాడ డివిజన్ ఉద్యోగాల్లో ఇతర డివిజన్ల వాళ్లకు అవ కా శమిస్తుండడంతో ఇక్కడ శిక్షణ తీసుకున్న వాళ్లకు అన్యాయం జరుగుతోందనే ఆవేదన ఉంది. దక్షిణ మధ్య రైల్వేలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగానికి రాజమండ్రి రైల్వే స్టేషన్ తూర్పు వైపున డెన్‌కి రైల్వే ప్రదేశాన్ని కేటా యించింది. సుమారు 30 వరకూ సిమెంటు బెంచీలను ఏర్పాటు చేసింది. అయితే ఎప్పటి నుంచో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్‌ని కాదని మూ డేళ్ల కిందట వచ్చిన మరో వ్యక్తి అజమా యిషీ చేయడం మొదలుపెట్టాడు. గ్రూపు గొడవలు అతని వల్లనే మొదలయ్యాయని చెబుతున్నారు. ఈ గలాటాలో డెన్‌కి తాళం పడింది. ఇక్కడ శిక్షణ తీసుకునే వాళ్లకు ఒక వాట్సాప్ గ్రూపు ఉంది. అయితే గందరగోళం వల్ల ఆ గ్రూపు నుంచి చాలా మంది తొలగి పోయారు. ఇప్పు డు ఎందరున్నారనే విషయం కూడా అయో మయంగానే ఉందని చెప్పవచ్చు. చివరికి అసి స్టెంట్ డిస్ట్రిక్ట్ కమిషనర్ కూడా రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఆయన కార్యా లయానికీ తాళం పడింది. గందరగోళానికి కారణమైన ఉద్యోగిని అధికారులు బదిలీ చేశారు. ఆపై డెన్‌ని పట్టిం చుకోకుండా వదిలేశారు. దీంతో ఇక్కడ పరిస రాలు భయానకంగా తయారయ్యాయి.

రాత్రి వేళ మాట అటుంచితే పగటి వేళ కూడా ఇక్కడ ఏదైనా అవాంఛనీయ సంఘటన జరి గితే బయటకు తెలియడం కష్టమనే చెప్పారు. ఈ డెన్ మూతబడిన సుమారు ఓ నెలకు ఒక వ్యక్తి ఇదే డెన్‌లోని ఓ చెట్టుకింద సిమెంటు బెంచీలో విగతజీవిగా మారాడు. 15 రోజుల తర్వాత ఈ దారుణం వెలుగుచూసింది. ఇంత అభద్రత ఉన్నా రైల్వే అధికారులు ఈ డెన్ విషయంలో ఈనాటికీ మేల్కొనలేదు. డెన్ మెయిన్ గేటుకు తాళం వేయడంతో మరో దారి అనధికారికంగా ఏర్పడింది.దీంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగు తున్నా యి.అధికారులు స్పందించి స్కౌట్స్ శిక్షణ ఆరం భించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



# తరగతి గదుల కొరత

**రాయదుర్గం, పతాకం న్యూస్:** మండలంలో చదంగొల్లలదొడ్డి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఈ సంవత్సరం పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. అయితే అందుకు తగ్గ సౌకర్యాలను కల్పించడంపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చూపారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 478 మంది విద్యార్థులు ఉన్నారు. 18 గదులు అవసరం కాగా.. కేవలం నాలుగు గదులే ఉన్నాయి. గదుల కొరతతో చెట్ల కింద, వరండాలో తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఇక పరిస్థితి మరీ ఘోరం. గదుల సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై హెచ్‌ఎం వెంకటరమణను మాట్లాడుతూ ప్రభుత్వం అదనపు గదులను నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో బెంకలకలం.. చెరువులో వేలకొద్దీ ఆధార్ కార్డులు



**పశ్చిమ బెంగాల్:** పశ్చిమ బెంగాల్‌లో ఓ అనూహ్య ఘటన తీవ్ర రాజకీయ దుమారం రేపింది. రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతున్న తరుణంలో పూర్బస్థలీ ఉత్తర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓ చెరువులో వేల సంఖ్యలో ఆధార్ కార్డులు లభించడం కలకలం సృష్టిస్తోంది. ఈ ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ పరిణామంపై అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), సీఎం మమతా బెనర్జీ లక్ష్యంగా బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. టీఎంసీ ప్రభుత్వం దేశ అంతర్గత భద్రతను పణంగా పెడుతోందని ఆరోపించింది. చొరబాటుదారులకు పశ్చిమ బెంగాల్ ఒక సురక్షితమైన స్థావరంగా మారిందనడానికి ఈ ఘటనే నిదర్శనమని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ జరుగుతుండగా ఇంత పెద్ద మొత్తంలో ఆధార్ కార్డులు బయటపడటం వెనుక పెద్ద కుట్ర ఉందని వారు అనుమానం వ్యక్తం చేశారు.

చెరువులో దొరికిన ఆధార్ కార్డులు ఎవరివి, అవి అక్కడికి ఎలా చేరాయన్న దానిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఘటనతో రాష్ట్రంలో బీజేపీ, టీఎంసీ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో ఎలాంటి మలుపులు తీసుకుంటుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై విధాన పత్రం విడుదల చేయాలి



**విజయవాడ, పతాకం న్యూస్:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై టిడిపి కూటమి ప్రభుత్వం విధాన పత్రం విడుదల చేయాలని కోరుతూ దళిత, గిరిజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. స్మృతివనం నిర్వహణకు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని, అభివృద్ధి కమిటీలో అధికారులతోపాటు పౌర సంస్థల ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరింది. స్మృతివనానికి నిధులు కేటాయించి, అభివృద్ధి చేయాలని, దీనిని వ్యాపార దృష్టితో కాకుండా పర్యాటక ప్రదేశంగా చూడాలని కోరుతూ దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ౧ నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు మాట్లాడారు. నిధులు మంజూరు చేసి విద్యా, వైజ్ఞానిక భాండాగారంగా స్మృతివనాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సమగ్ర ప్రణాళికను ప్రకటించాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విషయంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. మాల్యాద్రి మాట్లాడుతూ%ౌ% అంబేద్కర్ స్మృతివనం నిర్వహణలో పౌర సంస్థలను భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. జై భీమ్ భారత్ పార్టీ అధికార ప్రతినిధి వై.కొండలరావు మాట్లాడుతూ%ౌ% ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం నాడు 'చలో డాక్టర్ అంబేద్కర్ స్మృతివనం'నకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమతా సైనిక్ దళ్ మహిళా రాష్ట్ర అధ్యక్షులు శ్వేత మాట్లాడుతూ.. స్మృతివనం పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలన్నారు. దళిత, అభ్యుదయ సంఘం నాయకులు వై.నరసింహారావు మాట్లాడుతూ%ౌ% స్మృతివనం నిర్వహణను టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. ద బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి వై.అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. విగ్రహ నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.క్రాంతికుమార్ మాట్లాడుతూ%ౌ%స్మృతివనం అభివృద్ధికి రాజకీయాలకతీతంగా ఐక్యంగా పోరాడాలన్నారు. దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు కె.ప్రభాకరరావు, పి.నాగకుమార్, రవిబాబు, నాగేశ్వరరావు, ఎంవి.ఆంజనేయులు, జి.నటరాజు తదితరులు మాట్లాడారు. స్మృతివనం అభివృద్ధిపై మంత్రులు, అధికారులకు ఐక్యంగా వినతిపత్రాలు అందజేయాలన్నారు.

# 'సంతాన లేమి సమస్యలు' అసలు కారణాలేంటి?

## పరిష్కారాలు ఎలా?



ప్రస్తుతం చాలా మంది ఉన్నత చదువులు చదువుతున్నారు. ఉద్యోగాలు చేస్తూ, ఉన్నత పదవులు అందుకుంటున్నారు. ఇలా చదువులు, కెరీర్ ధ్యాసలో పడటం వల్ల పెళ్లి ఆలస్యంగా చేసుకుంటున్నారు. ఒకవేళ చేసుకున్న తర్వాత సంతానం కనటాన్ని వాయిదా వేసుకుంటున్నారు. జీవితంలో స్థిరపడ్డ తర్వాతే పిల్లలను కనాలని భావిస్తున్నారు. తర్వాత సంతానం కలగక డాక్టర్లు, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మరి, ఈ పరిస్థితికి కారణలేంటో ఇప్పుడు తెలుసుకుందాం! ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు కనుమరుగు కావటం, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుండటం, పిల్లలను కన్న తర్వాత వారి ఆలనా పాలనా చూసుకునేవారు ఇంట్లో లేకపోవటం వంటివీ ఇలాంటి నిర్ణయం తీసుకోవటానికి పురికొల్పుతున్నాయంటున్నారు నిపుణులు. కెరీర్ పరంగా ఇది మంచిదే కావొచ్చు కానీ, ఆలస్యమవుతున్నకొద్దీ గర్భం ధరించటం కష్టమవుతుందని వివరిస్తున్నారు. రెండు మూడేళ్లు ప్రయత్నిస్తున్నా గర్భం ధరించకపోతే దంపతులు కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడినీ ఎదుర్కోవాల్సి వస్తుంటుందని హెచ్చరిస్తున్నారు. ఇది ఆందోళనకు దారితీయటమే కాదు, సంతానం కలగటం లోనూ ఇబ్బందులకు దారితీస్తుందని పేర్కొంటున్నారు.

మహిళల్లో సంతానం కలిగే దశ పరిమితం అని అంటున్నారు నిపుణులు. రజస్వల నుంచే ఇది మొదలైనప్పటికీ తొలినాళ్లలో అండం సరిగా విడుదల కాదని, నెలసరీ సక్రమంగా అవదని చెబుతున్నారు. అంటే, రెండు మూడేళ్ల తర్వాతే సంతానం కలిగే అవకాశముంటుందని వివరిస్తున్నారు. అంతేకాకుండా, మహిళల్లో సంతానం కలిగే అవకాశం 32 ఏళ్ల నుంచీ తగ్గుతూ వస్తుంటుందని, ఇది 37 ఏళ్లు తర్వాత గణనీయంగా పడిపోతుందని పేర్కొంటున్నారు. 40 ఏళ్ల వయసులోపు అండాశయాలు పనిచేయడం మానేస్తాయని అధ్యయనం పేర్కొంది.అదే, మగవారికి ఏ వయసులోనైనా సంతానాన్ని కనే సామర్థ్యముంటుందని భావిస్తుంటారని, ఇది నిజం కాదని అంటున్నారు. మగవారికీ వయసు మీద పడుతున్న కొద్దీ సంతానం కలిగే సామర్థ్యం తగ్గుతూ వస్తుందని, వీర్యం నాణ్యత, శుక్రకణాల సంఖ్య 35 ఏళ్ల తర్వాత తగ్గుముఖం పడుతుందని తెలియజేస్తున్నారు. సంతానలేమితో బాధపడే మహిళల్లో రజస్వల నాటి నుంచే కొన్ని హెచ్చరిక సంకేతాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో నెలసరి సక్రమంగా రాకపోవచ్చని, చాలా త్వరగా కానీ, మరీ ఆలస్యంగా కానీ అవచ్చని చెబుతున్నారు. కొంత మందికి నెల కన్నా ఎక్కువ సమయం పట్టొచ్చని, మరికొందరికి కొన్ని నెలల తర్వాతా నెలసరి రావొచ్చని పేర్కొంటున్నారు. ఒకసారి రుతుక్రమం మొదలైతే ఎక్కువ కాలం కొనసాగొచ్చని తెలియజేస్తున్నారు. ఇన్సులిన్ నిరోధకత, ఊబకాయం, ముఖం లేదా శరీరంపై అసాధారణ జుట్టు పెరుగుదల, మొటిమలతో సంబంధం కలిగి ఉంటుందని అధ్యయనం పేర్కొంది. ఇలాంటి సమస్యలకు ప్రధానంగా హార్మోన్ల సమతుల్యత లోపించటం దోహదం చేస్తుందంటున్నారు. అండాశయాల్లో నీటితిత్తులు అండం సరిగా విడుదల కాక పోవటం, చిన్నవయసులోనే అండాశయాలు పనిచేయటం మానెయ్యొచ్చని తెలియజేస్తు న్నారు. ఇలాంటి సమస్యలకు చాలావరకూ రక్త పరీక్షలు, స్కానింగ్?తో గుర్తించవచ్చని సూచిస్తున్నారు. హార్మోన్ల మోతాదులు మా మూలుగా ఉన్నా కూడా కొన్ని అవయవ సమ స్యలూ సంతానం కలగటంలో ఇబ్బందులు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందులో గర్భాశయం లోపలి పొరలు అయినా ఎండో మెట్రియం గర్భసంచి వెలుపలా పెరుగుతుందని, ఇది అండాశయాలను దెబ్బతీయొచ్చు, ఫెలోపియన్ గొట్టాలు మూసుకునేలా చేయొచ్చని వివరిస్తున్నారు. కొందరిలో కడుపులో వచ్చే క్షయ, కటిభాగంలో వచ్చే ఇతరత్రా సమస్యలూ గర్భధారణకు ఇబ్బంది కలిగించొచ్చని, మరికొందరిలో పుట్టుకతోనే గర్భాశయంలో లోపాలు ఉండొచ్చని పేర్కొంటున్నారు. స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థలో అండాశయాలు, గర్భాశయం, ఫెలోపియన్ నాళాలు, ఎండోక్రైన్ వ్యవస్థ వంటి అనేక రకాల అసాధారణతల వల్ల వంధ్యత్వం సంభవించవచ్చని అధ్యయనం పేర్కొంది.

మగవారిలో క్రోమోజోమ్‌ల లోపాలు, వృషణాలు కిందికి దిగకపోవటం, వృషణాల ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు సంతానం కలగకపోవటానికి దారితీయొచ్చని నిపుణులు చెబుతున్నారు. వరిబీజం కూడా ఒక కారణం అంటున్నారు. అంతేకాకుండా, మద్యం తాగటం, సిగరెట్లు కాల్చటం, మాదక ద్రవ్యాల వ్యసనం వంటివీ వీర్యం నాణ్యత, పనితీరును దెబ్బతీయొచ్చని హెచ్చరిస్తున్నారు. మహిళలు, పురుషులోనూ డయాబెటిస్, ఇతర దీర్ఘకాల సమస్యలూ సంతానలేమికి కారణమవుతుంటాయని నిపుణులు అంటున్నారు.

అలాగే, ఒబెసిటీ కూడా పెద్ద ముప్పు కారకంగా చెబుతున్నారు. పురుగుమందులు, ప్లాస్టిక్స్? వాహనాల నుంచి వెలువడే పొగ వంటి పర్యావరణ అంశాలూ సంతానం కలగకపోవ టానికి దారితీస్తుంటాయని వివరిస్తున్నారు. గర్భధారణకు ప్రయత్నిస్తున్నా సంతానం కలగకపోవటం మనసును కలచివేస్తుందని, కుంగుబాటుకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల శాస్త్రీయ పద్ధతిలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. ఐవీఎఫ్ వంటి పద్ధతులు ఎంతో మేలు చేస్తాయని, ఆయా వ్యక్తులకు అనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. భార్యాభర్తలు ఒకరినొకరు నిందించుకోకుండా కలిసికట్టుగా ప్రయత్నిస్తే సంతానభాగ్యాన్ని పొందటం పెద్ద కష్టమేమీ కాదంటున్నారు.సంతానం కోసం నిజంగా, తరచూ ప్రయత్నిస్తున్నప్పటికీ ఏడాది దాటినా గర్భం ధరించకపోతే సంతానలేమి సమస్యగా పరిగణిస్తారని అంటున్నారు.

# పిగ్మెంటేషన్‌తో బాధపడుతున్నారా?



హైపర్ పిగ్మెంటేషన్ అనేది చర్మ సమస్య. హైపర్ పిగ్మెంటేషన్ సమస్య కలిగితే ట్యాన్, డార్క్ స్పాట్స్, మెలాస్మా, బ్లెమిషెస్, పోస్ట్ -ఇంఫ్లమేటరీ యాక్నె మార్క్స్, డార్క్ సర్కిల్స్ వంటి సమస్యలు కలుగుతాయి. ఈ సమస్య వలన చర్మం నల్లగా అయ్యి పోతుంది. ఇలాంటి సమస్యలకి కొన్ని టిప్స్ పాడితే సరిపోతుంది. అయితే ఈ మధ్య కాలంలో చాలా మంది. బంగాళాదుంప వాడితే ముఖంపై నల్ల మచ్చలు తగ్గిపోతాయని చెబుతున్నారు. మరి ఇందులో నిజమెంతో తెలుసుకోండి.సాధారణ రంగు కంటే కూడా చర్మం మరింత నల్లగా మారిపోతుంది. హైపర్ పిగ్మెంటేషన్ గురించి కొన్ని విషయాలు గురించి చూద్దాం. సాధారణంగా హైపర్ పిగ్మెంటేషన్ సమస్య అనేది మెలనిన్ ఎక్కువ ప్రొడక్షన్ అయితే వస్తుంది. స్కిన్ సెల్స్‌లో మెలనిన్ ఎక్కువ ప్రొడ్యూస్ అవ్వడం వల్ల చర్మం నల్లగా మారిపోయే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. అదే విధంగా ఎక్కువగా ఎండలో తిరిగినా ఇలాంటి చర్మ మార్పులు వస్తాయని.. ఈ కారణంగా కూడా ఈ సమస్య కలుగుతుంది. సరైన ఆహారం తీసుకోక పోవడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఈ సమస్య నుండి బయట పడాలంటే మార్కెట్లో దొరికే కాస్మెటిక్ ప్రొడక్ట్స్ బాగా హెల్ప్ చేస్తాయి. కాని వీటి కంటే కూడా నేచురల్ రెమెడీస్ ఫాలో అయితే మంచిది. నిజానికి మనం హోం మేడ్ రెమిడీస్‌తో చాలా సమస్యలను పరిష్కరించుకోవచ్చు మార్కెట్లో దొరికే ప్రోడక్ట్ బాగా పని చేసినప్పటికీ సైడ్‌ఎఫెక్ట్స్ కలగడం, లేదంటే ఎక్కువ డబ్బులు ఖర్చు అయిపోవడం జరుగుతుంది.పైగా నాచురల్ రెమెడీస్ వల్ల శరీరానికి ఎలాంటి హాని కూడా కలగదు ఎఫెక్టివ్‌గా పని చేస్తాయి. అయితే మరి అద్భుతమైన చిట్కాలు గురించి ఒక లుక్ వేసేద్దాం. నిజానికి వీటిని అనుసరించటం వల్ల హైపర్ పిగ్మెంటేషన్ సమస్య నుండి బయట పడొచ్చు. చర్మం రంగు కూడా క్రమంగా మారుతూ ఉంటుంది. పైగా సమస్య తగ్గి మీరు మరింత అందంగా కనిపించడానికి ఇది హెల్ప్ అవుతుంది. పసుపు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది అందానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంది. పసుపులో అద్భుతమైన గుణాలు ఉంటాయి. చర్మానికి ఇది బాగా హెల్ప్ అవుతుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి. ఇవి చర్మానికి చక్కగా పని చేస్తాయి. యాక్నె మొదలైన చర్మ సంబంధిత సమస్యలను తొలగిస్తుంది. శెనగపిండి, పసుపు కొద్దిగా రోజ్ వాటర్ తీసుకొని మీరు ఫేస్ ప్యాక్ వేసుకుని కాసేపు ఉంచుకుని తర్వాత కడిగేసుకుంటే డార్క్ స్పాట్స్ తగ్గుతాయి. కాబట్టి పసుపుతో ఈ విధంగా ప్రయత్నం చేసి చూడండి. మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.అలోవెరా కూడా బాగా పని చేస్తుంది నిజానికి ఆరోగ్యానికి, అందానికి కూడా ఇది ఉపయోగ పడుతుంది. జుట్టు సమస్యలు కూడా ఉండవు. అలోవెరాలో మెడిసినల్ గుణాలు ఉంటాయి. డార్క్ స్పాట్స్‌ని కూడా ఇది తొలగిస్తుంది. అయితే అలోవెరా మీకు బాగా పని చేయాలంటే అలోవెరా మొక్క నుండి అలోవెరా గుజ్జుని తీసుకుని ఎఫెక్ట్ అయిన ప్రాంతంలో రాయండి. దీనిని రాత్రి రాసి ఉదయాన్నే కడిగేసుకుంటే చక్కగా పని చేస్తుంది. ఇలా మీరు డార్క్ స్పాట్స్‌ని తొలగిపోయే వరకు రాయండి. ఇది కూడా మీకు చాలా బాగా పని చేస్తుంది ప్రయత్నం చేసి చూడండి. పాలు మరియు పెరుగు కూడా మంచిగా పని చేస్తాయి. స్కిన్‌కి మాయిశ్చరైజర్‌ను ఇస్తాయి. పైగా చర్మం పైన పాలు లేదా పెరుగు ఉపయోగించడం వల్ల చర్మం మృదువుగా ఉంటుంది అలానే కాంతివంతంగా ఉంటుంది. పిగ్మెంటేషన్ సమస్య నుండి కూడా కూడా ఇది బయట పడటానికి సహాయం చేస్తాయి. అయితే ఎలా ఉపయోగించాలి అనేది ఇప్పుడు చూద్దాం. పాలు లేదా పాల పదార్థాలను మీరు ఉపయోగించాలంటే ముందు ఒక టేబుల్ స్పూన్ శనగ పిండి తీసుకుని అందులో పసుపు వేసుకోండి. ఆ తర్వాత పచ్చి పాలు కానీ పెరుగు కాని వేసి పేస్ట్ లాగ చేసుకోండి ఈ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసి ఆరిన తర్వాత కడిగేసుకుంటే మీకే మార్పు కనబడుతుంది. ఇలా పాలు లేదా పెరుగుతో మీరు హైపర్ పిగ్మెంటేషన్ సమస్య నుండి బయట పడవచ్చు. నిజానికి పాలని చాలా బ్యూటీ ప్రొడక్ట్స్‌లో వాడుతూ ఉంటారు. సహజంగా మీరు ఇంట్లో తయారు చేసుకుని అనుసరిస్తే చక్కటి మార్పులను మీరు గమనించవచ్చు.

## గ్రీస్‌లో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శనలు



**ఏథెన్స్ :** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. " విద్య కోసం వీధుల్లోకి" నినాదంతో రాజధాని ఏథెన్స్‌తోపాటు దేశవ్యాప్తంగా 40 నగరాల్లో గురువారం ర్యాలీలు నిర్వహించారు. ఏథెన్స్‌లో లక్షల మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన జరిగింది. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరసనల్లో భాగస్వాములయ్యారు. ఫిబ్రవరిలో ఎన్నికైన దేశ అధ్యక్షుడు తసౌలాస్ అమలు చేస్తున్న కార్పొరేట్ విధానాలను వారు వ్యతిరేకిస్తున్నారు. విద్య వస్తువు కాదు, మార్కెట్ ప్రయోజనాలకు బదులుగా సమాజ ప్రయోజనాల కోసం, విజ్ఞానం కోసం చదువు వుండాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సిబ్బంది కొరతతో ప్రమాణాలు దిగజారుతున్నాయని, తక్షణమే టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగిపోయిందని, అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్నామని మీడియాకు వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలు విద్యను ఆధునీకరించకపోగా పేదలకు విద్య దూరమైపోయిందని ఉపాధ్యాయ యూనియన్లు విమర్శించాయి. సరిపడా తరగతి గదులు లేవని, భవనాలు శిథిలమైపోయి పనికిరాకుండా పోయాయని, పాఠశాలల విలీనం పేరుతో 10 కిలోమీటర్ల దూరంలోకి పాఠశాలను తరలించారని, దాంతో రవాణా ఖర్చులు పెరిగాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలు ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాయి. 'మా విద్య ప్రభుత్వానికి అనవసర ఖర్చు, మా కలలు వారికి ఖర్చు, అందుకే విద్యావసరాలకు నిధులు కేటాయించకూడదని ప్రభుత్వం నిర్ణయించుకుంది. మేము పోరాటాన్ని నేర్చుకున్నాం. విద్య కోసం, మెరుగైన అవసరాలకోసం పారాటం కొనసాగిస్తామని' విద్యార్థి సంఘాలు ప్రకటించాయి.

# త్వరలో 6,552 టిడ్కో ఇళ్లు అప్పగింత

## 8 ఏళ్ల పేదల నిరీక్షణకు తెర



**అమరావతి, పతాకం న్యూస్:** కలల సౌధం కోసం 8 ఏళ్లకు పైగా వేచి చూస్తున్న పేదల నిరీక్షణ త్వరలో ఫలించనుంది. 2017-19 మధ్యనే టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా వరకు గృహాల నిర్మాణం పూర్తయినా వైఎస్సార్సీపీ ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా 5 ఏళ్లపాటు కాలక్షేపం చేసి వారిని ఇబ్బందులకు గురిచేసింది. అద్దె ఇళ్లలోనే వారు మగ్గేలా చేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలతోపాటు కీలకమైన సదుపాయాలను కల్పించే చర్యలు చేపట్టింది. క్రమం తప్పకుండా నిధులు కేటాయిస్తూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తోంది. నవంబర్ నెల మొదలు వచ్చే ఏడాది మార్చి నాటికి 1.18 లక్షల ఇళ్లు పూర్తి చేసి దశల వారీగా అప్పగించనుంది. ఇప్పటికే పూర్తయిన 6,552 గృహాలు నవంబర్‌లో, 8,312 గృహాలను డిసెంబర్‌లో లబ్ధిదారులకు అందజేస్తారు. టిడ్కో గృహాలను 300 చ.అ. విస్తీర్ణం, 365 చ.అ. విస్తీర్ణం, 430 చ.అ. విస్తీర్ణం చొప్పున వివిధ కేటగిరీల్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 2017-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా 90 శాతానికిపైగా పూర్తయిన ఇళ్లకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికున్న రంగులను మార్చి ఆ పార్టీ రంగులను వేయించింది. దీని కోసమే దాదాపుగా రూ.7 కోట్ల వరకు ఖర్చు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనపై కనీసం దృష్టిపెట్టలేదు. కొన్ని ఇళ్ల విషయంలో ఎన్నికలు సమీపిస్తున్నాయని అప్పటికప్పుడు లబ్ధిదారులకు అప్పగించినట్లు హడావుడి చేశారు. అక్కడ ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు అక్కడికి వెళ్లి నివాసం ఉండలేదు. ఇప్పుడు సిమెంటు రహదారులు, తాగునీరు సౌకర్యం, మురుగునీటి పారుదల తదితర అన్ని వసతులు కల్పించి పేదలకు అందించనున్నారు.

లబ్ధిదారులకు అందజేత: ఒక గృహ సముదాయంలో ఇళ్ల నిర్మాణం పూర్తై అన్ని మౌలిక వసతుల కల్పన జరిగిన మేరకు ఆయా గృహాలను పేదలకు అప్పగించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇళ్లలో, ఆయా కాలనీల్లో అన్ని వసతులూ సమకూరాయా? లేదా అనేది అధికారులు ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత టిడ్కో అధికారులు పూర్తయిన ఇళ్లను అక్కడి మునిసిపల్ కమిషనర్లకు అప్పగించనున్నారు. వారు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి ఆధ్వర్యంలో గృహ ప్రవేశాలు చేపట్టనున్నారు. ఇప్పటికే చిత్తూరులోని మురుకుంబట్టు గృహ సముదాయంలో పూర్తయిన 672 ఇళ్లను మునిసిపల్ కమిషనర్లకు టిడ్కో అధికారులు అప్పగించారు.

హడ్కో నుంచి రూ.5 వేల కోట్ల రుణం: టిడ్కో ఇళ్ల పూర్తికి హడ్కో నుంచి రూ.5000 కోట్ల రుణాన్ని తీసుకునేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. ఆ సంస్థ కూడా రుణాన్ని ఇచ్చేందుకు ముందుకొచ్చింది. వారం రోజుల్లో రూ.2000 కోట్లు రుణం అందనుంది. తదుపరి ఇళ్ల పూర్తికి అనుగుణంగా మిగతా మొత్తాన్ని హడ్కో ఇవ్వనుంది.




# అమ్మకానికి ఆర్సీబీ



ఐపీఎల్ 2026 ఇంకా కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) ఫ్రాంచైజీని విక్రయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. విక్రయ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయిందని వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి. 2026 మార్చి కల్లా ఈ ప్రక్రియ పూర్తి కానున్నట్లు డియాజియో పీఎల్‌సీకి చెందిన భారత అనుబంధ సంస్థ యూనైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్(యూఎస్ఎల్) బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్(బీఎస్ఈ)కి లేఖ రాసింది.

రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఎస్‌పీఎల్)లో పెట్టుబడిపై సమీక్ష ప్రారంభిస్తున్నట్లు యూఎస్ఎల్ లేఖలో పేర్కొంది. అమ్మకానికి ఆర్సీబీ పురుషులు, మహిళల జట్లు ఉన్నాయి. రెండు టీమ్స్ అమ్మకం ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా.. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిచేయాలని కంపెనీ ఆశిస్తోంది. ఈ విషయంపై యూఎస్ఎల్ సీఈవో, ఎండీ ప్రవీణ్ సోమేశ్వర్ మాట్లాడారు. 'యూఎస్ఎల్‌కు ఆర్ఎస్‌పీఎల్ విలువైన, వ్యూహాత్మక ఆస్తి. అయితే మా వ్యాపారానికి ఇది ప్రధానం కాదు. ఐపీఎల్ జట్టును డియాజియో కంపెనీ సొంతం చేసుకోవడం పట్ల చాలా మంది వాటాదారులు అసంతృప్తిగా ఉన్నారు' అని తెలిపారు. అయితే మొత్తానికి ఆర్సీబీ జట్టు త్వరలోనే చేతులు మారనుంది.

వ్యాక్సిన్ తయారీదారు సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఇటీవల దాదాపు రూ.17వేల కోట్లకు ఆర్సీబీని కొనుగోలు చేస్తోందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇక ఆర్సీబీ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడనికి బడా వ్యాపారవేత్తలు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. జేఎస్‌డబ్ల్యూరీ గ్రూప్‌నకు చెందిన పార్థ్ జిందాల్ సహా ఉన్నత స్థాయి వ్యక్తులు డియాజియో మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. అదానీ గ్రూప్, ఒక ప్రముఖ ఢిల్లీ వ్యాపారవేత్త కూడా ఆర్సీబీ జట్టు కొనుగోలుపై ఆసక్తిగా ఉన్నారని పుకార్లు ఉన్నాయి. రెండు యూఎస్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. 2010లో లీగ్ విస్తరణ సమయంలో ఆదర్ తండ్రి సైరస్ పూనావాలా ఫ్రాంచైజీ కోసం బిడ్ వేశారు. కానీ అది అతడికి దక్కలేదు.

గతంలో ఆర్సీబీ ఫ్రాంచైజీ ప్రముఖ వ్యాపారి విజయ్ మాల్యా సొంతం. 2016లో మాల్యా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడినప్పుడు డియాజియో కంపెనీ మాల్యా మద్యం కంపెనీతో పాటు ఆర్సీబీని కూడా కొనుగోలు చేసింది. 2008లో మాల్యా తిరిగి ఆర్సీబీని 111.6 మిలియన్ డాలర్ల(రూ.76 కోట్లు)కు కొనుగోలు చేశాడు. 2014లో డియాజియో యూఎస్ఎల్ మెజారిటీ వాటాను కొనుగోలు చేసింది. 2016 నాటికి మాల్యా నిష్క్రమణ తర్వాత డియాజియో ఆర్సీబీని పూర్తిగా సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ జట్టును యూఎస్ఎల్ అనుబంధ సంస్థ రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఐపీఎల్‌లో 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ తొలిసారిగా ఈ ఏడాది ట్రోఫీని ముద్దాడిన విషయం తెలిసిందే.

# టీ20 వరల్డ్ కప్ 2026

## వేదికలు ఖరారు..




వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక వేదికలను ఖరారు చేసింది. భారత్‌లో ఐదు ప్రధాన నగరాలను, శ్రీలంకలో రెండు వేదికలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఆతిథ్యం ఇచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం భారత్‌లో అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబై, ఢిల్లీ నగరాలను మ్యాచ్‌ల నిర్వహణకు ఎంపిక చేశారు. అయితే, ఊహించినట్లుగానే బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి ఈ జాబితాలో చోటు దక్కలేదు. గత జూన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన ఘటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల ముగిసిన మహిళల వన్డే ప్రపంచకప్‌ను బీసీసీఐ చిన్న నగరాల్లో నిర్వహించింది. అయితే, 20 జట్లు పాల్గొనే టీ20 ప్రపంచకప్‌కు భద్రత అత్యంత కీలకమని భావిస్తున్న ఐసీసీ, ఈసారి కేవలం టైర్-1, మెట్రో నగరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకవేళ పాకిస్థాన్ జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే, తుదిపోరును కొలంబోలో నిర్వహించేందుకు శ్రీలంకను బ్యాకప్ ఆప్షన్‌గా ఉంచారు. అలాగే శ్రీలంక జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంటే, ఆ మ్యాచ్‌ను స్వదేశంలోనే ఆడేలా ఐసీసీ.. బీసీసీఐకి సూచించినట్లు సమాచారం.




## 14న థియేటర్స్‌కు రానున్న 'సంతాన ప్రాప్తిరస్తు'



చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా నవంబర్ 14న విడుదల కాబోతోంది. మధుర శ్రీధర రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాను సంజీవ్ రెడ్డి డైరెక్ట్ చేశాడు. షేక్ దావూద్ జి స్క్రీన్ ప్లే అందించారు. ఈ సినిమా ట్రైలర్ ను దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆనంద్ దేవరకొండ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ, 'మా అన్నయ్య విజయ్ దేవరకొండ నటించిన 'పెళ్ళిచూపులు' థియేటర్స్ లో వర్కౌట్ కాదని చాలామంది అన్నా ధైర్యంగా శ్రీధర్ సార్ ధైర్యంగా ముందుకెళ్ళారు. అలానే నాకు 'దొరసాని' సినిమాలో తొలి అవకాశం ఇచ్చింది కూడా ఆయనే. ఆయన హార్డ్ వర్క్ తప్పనిసరిగా పే చేస్తుంది. అది సంతాన ప్రాప్తిరస్తు విషయంలో నిజమౌతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ, 'అప్పట్లో 'కళ్యాణ ప్రాప్తిరస్తు' అనే మాట వినేవాళ్ళం... ఇప్పుడు 'సంతాన ప్రాప్తిరస్తు' అనే మాట వింటున్నాం. ఇవాళ లివ్ ఇన్ రిలేషన్, వెడ్డింగ్ అనేవి సులువు అయిపోయాయి. అయితే పిల్లలు పుట్టడమే సమస్యగా మారిపోయింది. ఇవాళ ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడం ఛాలెంజ్ గా మారిపోయింది. ఇవాళ్టి నుండీ మీరు మరింత కష్టపడి ఆ పనిని సక్సెస్ ఫుల్ గా చేయాలి. ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

హీరోయిన్ చాందినీ చౌదరి మాట్లాడుతూ – 'మన సొసైటీలో ఫెర్టిలిటీ ఇష్యూ చాలా ఉంది. అయితే దాని గురించి మాట్లాడేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇదొక మాట్లాడకూడని విషయమని అనుకుంటున్నారు. మేల్ ఫెర్టిలిటీ అనే ఇష్యూను తీసుకుని ఎంటర్ టైన్ మెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్ తో ఎక్కడా హద్దు దాటకుండా సెన్సిబుల్ గా ప్రేక్షకులంతా కలిసి చూసేలా మా చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు సంజీవ్ రెడ్డి. ట్రైలర్ ను అందరికీ షేర్ చేయండి. మీ ఫ్యామిలీ , ఫ్రెండ్స్ తో ఈ నెల 14న థియేటర్స్ కు రావాలని రిక్వెస్ట్ చేస్తున్నా' అని అన్నారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ, 'ఆనంద్, నేను యూఎస్ లో ఉద్యోగాలు చేసి సినిమా మీద ప్యాషన్ తో ఇక్కడికి వచ్చాం. ఆనంద్ 'బేబి' మూవీతో మంచి విజయాన్ని అందుకున్నారు. నేను గతంలో ఒక సినిమా చేశాను. ఆ మూవీ సరిగ్గా ఆదరణ పొందలేదు. నిరాశలో ఉన్న ఆ టైమ్ లో మధుర శ్రీధర్ నీతో సినిమా చేస్తాను అని సపోర్ట్‌గా నిలబడ్డారు. ఆ తర్వాత హరి ప్రసాద్ గారు జాయిన్ అయ్యారు. ఈ చిత్రంలో చైతన్య అనే సాఫ్ట్ వేర్ ఎంప్లాయ్ క్యారెక్టర్‌లో నటించాను. ఆ పాత్రకు తగినట్లు నన్ను దర్శకుడు సంజీవ్ గారు మార్చేశారు. సెట్ లోకి వెళ్లాక నన్ను నేను చూసుకుంటే కొత్తగా అనిపించింది. ఇందులో మేల్ ఫెర్టిలిటీ అనే కొత్త విషయం ఉంది. కావాల్సినంత ఎంటర్ టైన్ మెంట్, సినిమా చివరలో ఎమోషన్స్ ఉన్నాయి. ఒక మంచి మెసేజ్ కూడా ఉంది. ఇవన్నీ ఇప్పుడున్న ప్రేక్షకులను థియేటర్స్ కు రప్పించే ఎలిమెంట్స్. కాబట్టి ఈ సినిమా తప్పకుండా మీ ఆదరణ పొందుతుందని నమ్ముతున్నాను' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలతో పాటు రైటర్ కళ్యాణ్ రాఘవ్, షేక్ దావూద్ జి, డైరెక్టర్ సంజీవ్ రెడ్డి, సంగీత దర్శకుడు అజయ్ అరసాడ ఈ మూవీ మేకింగ్ అనుభవాలను తెలిపారు.

## నేను హీరోయిన్ అంటే.. మొదట రానా ఒప్పుకోలేదు

## భాగ్యశ్రీ బోర్సే



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడికల్ డ్రామా కాంత , సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్తో కలసి రానా దగ్గుబాటి తన స్పిరిట్ మీడియా పతాకంపై నిర్మిస్తున్నారు. నవంబర్ 14న విడుదల కానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభాస్ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల చేశారు. 1950-60ల నాటి మద్రాస్ సినీ పరిశ్రమ నేపథ్యంలో కథ సాగుతుంది. దుల్కర్ టీకే మహదేవన్ అనే సూపర్ స్టార్ పాత్రను పోషిస్తున్నారు. అతనికీ, దర్శక నిర్మాత అయిన అయ్య (సముద్రఖని)కు మధ్య ఉన్న సంఘర్షణ నేపథ్యంలో కథ సాగుతుంది అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.

ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాను అందరూ థియేటర్లలో చూడండి. ఇదొక గ్రేట్ ఎక్స్ పీరియన్స్. నా స్నేహితుడు రానాతో కలసి నిర్మించడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ 'కథ విన్న వెంటనే తప్పకుండా ఈ సినిమా చేయాలని పించింది. ఇలాంటి పీరియాడిక్ చిత్రానికి దుల్కర్ లాంటి రెట్రోకింగ్ పర్ఫెక్ట్, నవంబర్ 14 తర్వాత మీరందరూ దుల్కర్‌ను నట చక్రవర్తి అని పిలుస్తారు' అని చెప్పారు.కాంత లాంటి గొప్ప చిత్రంలో నటించినందుకు గర్వంగా ఉందని సముద్రఖని తెలిపారు. దుల్కర్ సల్మాన్ నటన ప్రతి ఒక్కరినీ మెప్పిస్తుందని సెల్వమణి సెల్వరాజ్ చెప్పారు.

భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నాకు ఇది చాలా స్పెషల్ చిత్రం అని భాగ్యశ్రీ బోర్సే తెలిపారు. ఇప్పటివరకు నా సినిమాలు చూశారు. ఈ సినిమాలో నేను యాక్ట్ చేయడం చూస్తారు. కాంత నాకు చాలా చాలా స్పెషల్. ఈ సినిమాకు నేను హీరోయిన్ అంటే మొదట రానా గారు ఒప్పుకోలేదు.. తర్వాత ఆడిసన్స్ తర్వాత గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు అంటూ చెప్పుకొచ్చింది. మీ అందరి ప్రేమకు థాంక్ యూ. ఈ సినిమాని థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నా అన్నారు.






## ప్రభుదేవాతో అనసూయ రొమాంటిక్ సాంగ్



ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ , అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం వోల్ఫ్ . ఎప్పుడో రెండు రెండేండ్ల క్రితం 2023 ఆగస్టులో టీజర్ విడుదల చేసిన మేకర్స్ ఇన్నాళ్లకు మళ్లీ ఓ అప్డేట్ ఇచ్చారు. తాజాగా ఈ సినిమా నుంచి సాసా సాసా అంటూ సాగే తమిళ లిరికల్ వీడియో పాటను గురువారం విడుదల చేశారు. ఇప్పుడీ పాట సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇంటరిగా ఉన్న ప్రభుదేవా ఇంట్లోకి ముగ్గురు ముద్దుగుమ్మలు ఒక్కొక్కరిగా ఎంట్రీ ఇవ్వడం ఆపై ఆ ముగ్గురు చాటుగా మొబైల్‌లో వీడియో తీస్తూ హీరోను కవ్విస్తూ సరససల్లాపాలు ఆడడం వంటి థీమ్‌తో సాంగ్ రొమాంటిక్ టచ్‌లో సాగింది. ప్రభుదేవా ఇంటికి వచ్చిన ముగ్గురు లేడీస్‌తో రొమాన్స్ సన్నివేశాలు యూత్‌లో హీట్ పుట్టిస్తున్నాయి. మెలోడియస్ బీట్స్‌కి తోడు, ప్రతి షాట్‌లో కూడా స్టైలిష్ ప్రెజెంటేషన్ కనిపిస్తోంది. త్రీసమ్ సాంగ్ కావడంతో కుర్రకారు వేగంగా ఈ పాటకు కనెక్ట్ అవుతున్నారు. ప్రభుదేవా 60వ సినిమాగా రూపొందిన ఈ చిత్రానికి వినూ వెంకటేష్ దర్శకత్వం వహించగా సందేశ్ నాగరాజు మరియు సందేశ్ ఎన్ నిర్మాతలు. తెలుగు యాంకర్ అనసూయ భరద్వాజ్ ఓ తాంత్రికురాలి పాత్రలో కనిపించనుండడం విశేషం. ఆమె రోల్ హర్రర్-రోమాన్స్ మిక్స్‌గా ఉండబోతోందని సమాచారం. అయితే ఈ పాటను చూసిన వారంతా ఏంటి అనసూయ ఇలాంటి పాటలో నటించింది. అంత అవసరం ఏం వచ్చిందంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

లేచిన దగ్గరి నుంచి సూక్తులు చెప్పేవారు ఇలాంటి పాటలో నటిస్తారా అంటూ ట్వీట్లు చేస్తున్నారు. చూస్తుంటే రెండు మూడు రోజుల్లో ఈ పాట, అనసూయ సామాజిక మాధ్యమాల్లో గట్టిగానే ట్రోల్ అవక తప్పదూమో అనిపిస్తుంది. త్వరలోనే ఈ చిత్రం తమిళంతో పాటు ఇతర భాషల్లోనూ థియేటర్లలో విడుదల కానుంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**